క్లుప్తంగా

సిగ్నేచర్ ఇండియా ఎగ్జిబిషన్ ప్రారంభం



పాత గుంటూరు: రింగు రోడ్డు సెంటర్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో సిగ్నేచర్ ఇండియా ఆధ్వర్యంలో గ్రాండ్ మెగా జువెలరీ ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎగ్జిబిషన్ నిర్వాహకురాలు పరుచూరి రూపరేఖ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ డిజైనర్లు తయారు చేసిన వివిధ రకాల జ్యూయలరీతో 30 వరకు స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రదర్శన ఈ నెల 30 వరకు అందుబాటులో ఉంటుందని, నగర ప్రజలు సందర్శించాలని ఆమె కోరారు.

పన్ను రాయితీకి నేడే ఆఖరి రోజు

నెహ్రూనగర్: పన్ను రాయితీకి ఆదివారం ఒక్కరోజే గడువు ఉందని, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లో క్యాష్ కౌంటర్లు రాత్రి 12 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీని నగర ప్రజలు విస్తృతంగా వినియోగించుకుంటున్నారని, ఇప్పటికే రూ.45 కోట్ల పన్ను వసూలు జరిగినట్లు ఆమె పేర్కొన్నారు. భారత్‌పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో క్యాష్ కౌంటర్లు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చలివేంద్రం ప్రారంభం



కొరిటిపాడు(గుంటూరు): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చల్లని మజ్జిగ, మంచి నీటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక ఏసీ కళాశాల కెనరా బ్యాంక్ శాఖ ఆవరణలో ఆ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండే ఎండలో చల్లటి మజ్జిగ, మంచినీరు అందించడం మహత్కార్యమన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమానికి ఎక్కువ మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ.శ్రీనివాసక్ కన్నన్, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కర్మయోగి బాబూ జగ్జీవన్‌రామ్ పుస్తకావిష్కరణ



పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ కల్యాణ మండపంలో బాబూ జగ్జీవన్‌రామ్ ఆల్ ఇండియా సమతా మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ శృంగారపాటి ఆనందబాబు రచించిన కర్మయోగి జగ్జీవన్‌రామ్ పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. సభకు మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమెను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కా ఆనంద్‌బాబు, వర్ల రామయ్య, తెనాలి శ్రావణ్‌కుమార్, న్యాయవాది దావులూరి శామ్యూల్ జాన్, మహాత్మా గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, ఆహ్వాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతమ్మ వారి జయంతి



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో శనివారం శ్రీ రామనామ సంకీర్తన సంఘం ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల నిర్వహణలో శనివారం సీతమ్మ వారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు ఆలయ పూజారులు వేదమంత్రాల నడుమ లక్ష మల్లెలార్చన, సుగంధ ద్రవ్యాలతో విశేష పూజల్ని జరిపారు. మహా హారతి అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్ని కె.వి. సుబ్బారావు, అక్కిశెట్టి బాబూరావు పర్యవేక్షించారు.

ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలే ధ్యేయం

- డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్
- స్పందన – జగనన్నకు చెబుదాంపై అధికారులకు అవగాహన



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం మే 9 నుంచి ప్రారంభం కానున్న స్పందన – జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, స్పందన అధికారులు, ఆపరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం కన్నా మెరుగైన పరిష్కారం, అధికారుల్లో జవాబుదారీతనానికి జగనన్నకు చెబుదాంని ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేకంగా 1902 హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారని, దీనికి కాల్ చేసి గ్రీవెన్స్ రిజిస్టర్ చేస్తే దాన్ని అత్యంత నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారంపై అన్ని స్థాయిల్లో మానిటరింగ్ విభాగాలు కూడా ఉంటాయని తెలిపారు. గ్రీవెన్స్ పరిష్కారంలో క్వాలిటీని పెంచడం అన్నది ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమస్యల పరిష్కారంపై ప్రజలకు క్రమం తప్పకుండా అప్‌డేట్స్ కూడా అందుతాయన్నారు. సమస్యల పరిష్కారంపై అర్జీదారుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా ఉంటుందని తెలిపారు. వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి 1902 హెల్ప్‌లైన్‌గురించి అవగాహన కల్పించాలని డెప్యూటీ కమిషనర్ సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్‌ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఈ–డిస్ట్రిక్ అధికారి రత్నం, స్పందన అధికారులు, విభాగ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కన్న మాస్టారుకు ఏఎన్‌యూ పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ పట్టా అందజేస్తున్న ప్రసాద్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారుకు ఏఎన్‌యూ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఏఎన్‌యూ ద్వారా ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) పరిశోధన విభాగ సహాయ డైరెక్టర్ ఆచార్య బి. ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ టీచింగ్ ఆటిట్యూడ్, ఆప్టిట్యూడ్ అండ్ ఎఫెక్టివ్‌నెస్ యమాంగ్ ది ప్రోస్పెక్టివ్ టీచర్స్' అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రైలుపేటలోని కన్న ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్‌బాబు చేతుల మీదుగా కన్న మాస్టారు, రాజేశ్వరీదేవి దంపతుల్ని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత వాణిజ్య పన్నుల శాఖాధికారి సత్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పాత గుంటూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుంటూరు పట్టాభిపురం ఆధ్వర్యంలో శనివారం జేకేసీ కళాశాల రోడ్డులో మజ్జిగ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జి. నాగేశ్వరరావు, క్లబ్ గవర్నర్ కృపానందం, లయన్ వీరప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం కళాశాలలో జరిగిన సభలో క్లబ్–316 హెచ్‌లో ఏకగ్రీవంగా ఎన్నికయిన జిల్లా గవర్నర్ కృపానందం, వైస్ జిల్లా గవర్నర్లు పి. గోపీచంద్, సీహెచ్. హరిప్రసాద్‌ను క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూతలపాటి వీరప్రకాశరావు, బాల శ్రీనివాస్, ఎ.జె. సాయిశంకర్, పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు జన్మదిన వేడుకలు

పట్నంబజారు: నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రింగు రోడ్డులోని ఆయన నివాసంలో ఉదయం వేదపండితులు ముందుగా ఆశీర్వాదం అందజేశారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తల నడుమ ఆయన కేక్‌ను కట్ చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, పార్టీ నేతలు షేక్ షౌకత్‌తో పాటు పలువురు హాజరై ఎంపీ శ్రీకృష్ణదేవరాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

లీగల్ విభాగం ఆధ్వర్యంలో...

ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సీడీ భగవాన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అరండల్‌పేటలోని లీగల్ విభాగం కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం నేతలు, న్యాయవాదులు కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, వజ్రాల రాజశేఖరరెడ్డి, కాసు వెంకటరెడ్డి, సాగర్, సూరిబాబు, మంజుల, క్రాంతి, అనిల్‌కుమార్, ప్రసాద్, పల్లపు కృష్ణ, బాలాజీ, జి. అశోక్‌కుమార్, బి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

పట్నంబజారు: నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి శనివారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, తాడికొండ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: కొత్తపేట శివాలయం నుంచి నెహ్రూనగర్ రోడ్డు వైడెనింగ్ కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని కొత్తపేట ఏఈ ఎస్.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట, రామిరెడ్డితోట, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, గణేశ్వరరావుపేట, పొత్తూరువారితోట, గుంటూరువారితోట, రైలుపేట, లాలాపేట, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు. వినియోగదారులంతా సహకరించాలని ఆయన కోరారు.

జీజీహెచ్‌లో భోజనశాల తనిఖీ



భోజనం చేస్తున్న జేసీ రాజకుమారి, డాక్టర్ నీలం ప్రభావతి తదితరులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో మధురాన్నం భోజనశాలను జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి శనివారం పరిశీలించారు. వంటశాలలో ఆహార పదార్థాలు సిద్ధం చేసే బాయిలర్స్, భోజనశాలలో మౌలిక సౌకర్యాలు, మంచి నీటి సదుపాయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె అక్కడే భోజనం చేశారు. రుచిగా, శుచిగా అందిస్తున్నారని నిర్వాహకుల్ని అభినందించారు. ఆసుపత్రి ఆవరణలో భోజనశాలకు వెళ్లే మార్గాలను సూచిస్తూ సూచికల్ని ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మాజీ మంత్రి రంగనాథరాజు పర్యవేక్షణలో పేద రోగుల సహాయకులకు రెండు పూటలా రోజూ వెయ్యి మందికి పైగా ఉచితంగా భోజనం అందించడం అభినందనీయమని తెలిపారు. ఆమె వెంట జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, జిల్లా ఉపాధి అధికారి రఘు, ఫణీంద్ర, భోజనశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రూ. 8 లక్షల చెక్కు



చెక్కును అందజేస్తున్న కొల్లా శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: గుంటూరులోని తలసేమియా నీడ్స్ బ్లడ్ బ్యాంక్ సేవలు అభినందనీయమని కొల్లా సాకేత్ ఫౌండేషన్ అధినేత, ఎన్నారై కొల్లా శ్రీనివాసరావు తెలిపారు. తలసేమియా చిన్నారుల వైద్య సేవలు నిమిత్తం నీడ్స్ బ్లడ్ సెంటర్ నిర్వాహకులకు శనివారం ఆయన రూ. 8 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కొల్లా సాకేత్ ఫౌండేషన్ ఏటా అమెరికాలో 5కే వాక్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిద్వారా వచ్చిన డొనేషన్‌కు తాము కొంత జత చేసి ఇండియా, అమెరికాలోని పేద పిల్లల విద్యకు చేయూతనిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ సందీప్, క్యాంపు ఆర్గనైజర్ సాంబశివారెడ్డి, నీడ్స్ సొసైటీ అధ్యక్షుడు గూడూరు శ్రీధర్, మెడికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగన్' అని చాటిచెబుతున్న ప్రజలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి రోశయ్య నేతలు

పట్నంబజారు: రాష్ట్ర ప్రజలంతా మా నమ్మకం నువ్వే జగన్ అని చాటి చెబుతున్నారని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కిలారి రోశయ్య చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 27న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29కి రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల ఇళ్లలో ప్రజల్ని కలుసుకున్నట్లు చెప్పారు. 1.10 కోట్ల మిస్డ్ కాల్స్‌ను ఇచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డిపై వారికి ఉన్న నమ్మకాన్ని తెలియజేశారని చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా 7లక్షల మంది గృహసారథులు, పార్టీ నేతలు ఈ బృహత్తర కార్యక్రమానికి ఎంతో పాటుపడ్డారని, వారందరికీ అభినందనలు తెలియజేశారు. సీఎంగా వై.ఎస్. జగన్ బాధ్యతలు చేపట్టాక రూ. 2లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారులకు మేలు చేసి ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న విశ్వాసం తెలుస్తోందని, దీనిపై కూడా టీడీపీ నేతలు బురదజల్లే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. 2014 నుంచి 2109 వరకు ప్రజలకు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు ఏదైనా మేలు చేశారా? అని ప్రశ్నించారు. అసలు గడపగడపకు వెళ్లే దమ్ముందా ? అని సవాల్ విసిరారు. టీడీపీకి చెందిన ఎన్నో కుటుంబాలకు సైతం సంక్షేమ పథకాలు అందాయని, కులమత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ పాలన సాగుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే కిలారి రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో సైతం 90శాతం కుటుంబాలు పూర్తయ్యాని, 70శాతం మిస్డ్ కాల్స్ వచ్చాయని చెప్పారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి షూ పంపిణీ




షూ పంపిణీ చేస్తున్న ఆర్ఎఫ్‌వో జిలాని

పట్నంబజారు: జిల్లాలోని అగ్నిమాపక సిబ్బందికి శనివారం గమ్ షూ పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆర్ఎఫ్‌వో ఎంఏక్యూ జిలాని, డీఎఫ్‌వో ఎన్. వెంకటేశ్వరరావు, ఏడీఎఫ్‌వో ఎన్. పార్థసారథి, ఎస్ఎఫ్‌వో శ్రీనివాసరావు సిబ్బందికి అందజేశారు. తెనాలి గౌతమ్ రెసిడెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ గమ్ షూను అందజేసినట్లు తెలిపారు. ఆయనకు అగ్నిమాపక శాఖ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి చేసేందుకు రాష్ట్రస్థాయి ఉద్యమ కార్యాచరణ చేపడుతున్నట్లు నవ్యాంధ్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు మాదిగ పేర్కొన్నారు. అంబేడ్కర్ భవనంలో శనివారం నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాదిగ మాట్లాడుతూ మే 5 నుంచి జూన్ 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 'మాదిగ పల్లెల మేలుకొలుపు' పేరుతో గ్రామ కమిటీల నిర్మాణం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జూన్ 15 నుంచి 'మాదిగల మేలుకొలుపు' మహా యాత్ర ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు మాదిగ జాతి సమమస్యలపై వినతి పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. ప్రతి జిల్లాలో మాదిగలకు చెప్పుల దుకాణాలు కేటాయించాలని, డప్పు కళాకారులకు పింఛన్‌ను 5వేల రూపాయలకు పెంచాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్లకు నిధుల కేటాయింపు రెట్టింపు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గాలిముట్టి గురవయ్య, పి. మంగయ్య, మురికిపూడి మోజెస్, మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరిశపోగు భరత్ కుమార్, రాష్ట్ర యువసేన అధ్యక్షుడు ముట్లూరి ఆకాష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ భద్రత దినోత్సవం



ఏఎస్పీని సత్కరిస్తున్న ఏపీ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యులు

పట్నంబజారు: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోపవరపు వెంకటకుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ భద్రతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నిచికేస్ సలేక్‌ను దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావును అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సేవ, ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు ఎస్.వి.ఎల్.ఎన్.మూర్తి, జి.సత్యనారాయణ, పాండురంగారావు, షేక్ నజీర్ పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై కార్పొరేషన్ శ్రద్ధ చూపాలి

రేట్ పేయర్స్ అసోసియేషన్ విన్నపం



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

నెహ్రూనగర్: తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపాలని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓరుగంటి నారాయణరెడ్డి కోరారు. అరండల్‌పేటలోని హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరం, పరిసర ప్రాంతాల్లోని 60 ఓవర్ హెడ్ ట్యాంకుల అపరిశుభ్రతను నగర కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా కొంత వరకు ప్రక్షాళన జరిగిందని చెప్పారు. అయినప్పటికీ ఎక్కువ శాతం ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణ లోపం వల్ల ప్రజలు కాలుష్య నీరు తాగి జబ్బుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ మెట్లు పూర్తిగా పాడై , చాలాకాలంగా క్లీనింగ్ జరగడం లేదన్నారు. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టాలని ఆయన కోరారు. మురికి నీరు పారుదల జరిగే ప్రధాన పీకల వాగు, అగతవరప్పాడు వాగుతో పాటు ఇతర చిన్న వాగులు ఐదు పైగా ఉన్నాయని, వాటి నిర్వహణ కూడా సరిగా లేదని చెప్పారు. ప్రధాన మురికి నీటి పారుదల జరిగే పీకల వాగు జాతీయ రహదారి ప్రక్కన కల్వర్టు కుంచించుకుపోయిందని తెలిపారు. పూడిక తీయనందున బుడంపాడు, సుద్దపల్లి, వేజెండ్ల, గారపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతూ, రైతులు నష్టపోతున్నారన్నారు. సమస్యను అనేకసార్లు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆయన కోరారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పరంధామయ్య, ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మద్ది రాధాకృష్ణ, కార్యదర్శులు ఆర్. అంజిరెడ్డి, ఆర్.రామ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ప్రొఫెసర్ నూతలపాటి అరవింద, వల్లూరి సదాశివరావు, దాసరి రామ్మోహన్‌రావు, కోశాధికారి మద్ది సాయిరాం పాల్గొన్నారు.

నేడు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జన్మదినోత్సవం

పాత గుంటూరు: గంటలమ్మ చెట్టు వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం అమ్మవారి జన్మదిన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కొత్తూరి వెంకట నరసింహారావు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, విశేష పూజలు, అభిషేకాలు, 11 గంటలకు సామూహిక కుంకుమార్చన, 12 గంటలకు మంత్ర పుష్పం, హారతి, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు లక్ష మల్లెలతో పుష్పయాగ మహోత్సవం, కోలాట ప్రదర్శన జరుగుతాయని వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి నుంచి అమ్మవారి జయంత్యుత్సవాలు

ఆర్.అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో ఆదివారం నుంచి అమ్మవారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి నగేష్‌కుమార్ తెలిపారు. 30న ఉదయం హోమాలు, అభిషేకాలు, కలశాలతో ఊరేగింపు, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు ప్రతిరోజు కుంకుమ, అలంకార పూజలు జరుగుతాయని వివరించారు.

మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఎంఈసీ విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించిన సందర్భంగా శనివారం సంస్థ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బ్రాడీపేటలోని మెయిన్ క్యాంపస్ వద్ద విద్యార్థులు, అధ్యాపకులతో ఏర్పాటు చేసిన ర్యాలీని సంస్థ డైరెక్టర్ నాళం శ్రీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంఈసీలో ఎస్.సాయిప్రజ్ఞ 500 మార్కులకు గాను 492 సాధించిందని తెలిపారు. 491కి పైగా ఆరుగురు, 490కి పైగా 12 మంది, 480కి పైగా 147 మంది, 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 430 మంది ఉన్నట్లు వివరించారు. స్టేట్ టాప్–10లో 109 మంది, టాప్–20లో 224 మంది ఉన్నారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో టి. శశాంక్ వెయ్యి మార్కులకు 982 సాధించాడని పేర్కొన్నారు. 981కి పైగా నలుగురు, 975కి పైగా 47 మంది, 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 900 మంది ఉన్నారని వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీ స్టేట్ టాప్–10లో 72 మంది, టాప్–20లో 230 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో మహిళను మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లచెరువుకు చెందిన నిఖిలేశ్వరికి వాట్సాప్‌లో కొద్దిరోజుల కిందట ఓ లింక్ వచ్చింది. అందులో పెట్టుబడి పెడితే డబ్బులు వస్తాయని నమ్మబలికారు. ఈ క్రమంలో ఒక అకౌంట్ నంబరు ఇచ్చారు. తొలుత రూ. 2లక్షలు పెట్టుబడి పెట్టగా, అందుకు తగ్గ నగదును పంపారు. అనంతరం నిఖిలేశ్వరి రూ. 14 లక్షల వరకు సంబంధిత గుర్తు తెలియని వ్యక్తుల అకౌంట్‌కు పంపగా తర్వాత ఆ వాట్సాప్ యాప్, అకౌంట్ వారు డిలీట్ చేశారు. ఎంత ప్రయత్నించినప్పటికీ వివరాలు తెలియకపోవడంతో బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులపై కేసు నమోదు

బహిరంగంగా మద్యం తాగుతున్న పది మందిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటిపాడు పరిసర ప్రాంతాల్లో బహిరంగం మద్యం తాగుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు శనివారం దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక మృతిపై కేసు నమోదు

బాలిక మృతిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 2వ లైనులో నివసిస్తున్న కమల్ భూషణ్‌రాయ్ కుమార్తె తొమ్మిది సంవత్సరాల ఎం.మహిమాన్వితారాయ్ శుక్రవారం అర్ధరాత్రి ఫిట్స్ వచ్చి మంచం మీద నుంచి కిందపడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి సెలవుల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



విద్యార్థినులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేస్తున్న ఖాసిం, విజయలక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ. ఖాసిం సూచించారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తల్లిదండ్రులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, పిల్లల ప్రోగ్రెస్ రిపోర్టులు ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. వేసవి సెలవుల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సమయాన్ని వృథా చేయకుండా నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. ఇందుకు ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయుల సహకారం ఉంటుందని తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం బి.విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ సుభాని, ఉపాధ్యాయులు పద్మజ పాల్గొన్నారు.